పెట్టెను తగిలిస్తే అది ఇంజనును పట్టుకొని ఎలా వెళ్ళిపోతుందో అలాగ నామస్మరణ వలన నీకు భగవంతుడితో చుట్టరికం ఏర్పడుతుంది. జపయజ్ఞం చేసేవారు ఎటువంటివారు అంటే గుమ్మం దగ్గర కూర్చొని యజమాని వచ్చి లోపలకు దయచేయండి అనేవరకు మీరు ఉండనక్కరలేదు, మీ అంతట మీరు సహజంగానే వెళ్ళి హృదయ గుహలో పడిపోతారు. భగవంతుడి మీద ఉన్న భక్తి వలన, నామస్మరణ వలన మీరు సింహద్వారం దగ్గర ఆగనక్కరలేదు, హాలులో కూర్చోనక్కరలేదు, యజమాని వంట ఇంట్లో ఉంటే మీరు కూడా అక్కడకు వెళ్ళిపోవటమే, జపమార్గం అటువంటిది, డైరెక్టుగా భగవంతుడితో అనుసంధానం ఏర్పడుతుంది. భగవంతుడు, భగవంతుడి యొక్క నామం వేరుకాదు, నామం భగవంతుడై ఉన్నది. నామస్మరణ వలన హృదయంలో ఉన్న సత్యమైన వస్తువుతో నీకు అనుబంధం ఏర్పడుతుంది, అనుబంధం ఏర్పడటమే కాదు అది మిమ్మల్ని లోపలకు గుంజుకొని మీరు ఏదిగా ఉన్నారో దాని తాలుక ఎరుక మీకు కలుగుజేస్తుంది, అది జపయజ్ఞం. మీరు జపయజ్ఞాన్ని తక్కువగా అంచనా వేయవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు.

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 17-02-08, భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భీష్మఏకాదశి. భీష్ముడు పరమపవిత్రుడు, మహాభక్తుడు, మహావీరుడు, మహాజ్ఞాని, బ్రహ్మచారి, స్వచ్ఛంద మరణం కలవాడు. భీష్ముడికి మోక్షం వచ్చిన రోజు కాబట్టి భీష్మ ఏకాదశి అని పేరు వచ్చింది. భీష్ముడిలో ఎంత ఔన్నత్యం ఉన్నప్పటికి, జ్ఞాని అయినప్పటికి ఆయన దేహప్రారబ్ధాన్ని బట్టి కౌరవుల తరపున యుద్ధం చేయవలసి వచ్చింది. మహాభారత యుద్ధంలో అందరికంటే గొప్ప వీరుడు భీష్ముడే. ఆయన కౌరవుల తరపున గొప్పగా యుద్ధం చేసినా, భీష్ముడిని పాండవపక్షపాతి అని ధుర్యోధనుడు అంటూ ఉండేవాడు. ఆయన ఆరాధించిన దేవుడికి ఎదురుగా నిలబడి, ఆ దేవుడి మీద బాణాలు వేసి యుద్ధం చేయవలసివచ్చింది. అదీ ఆయన ప్రారబ్ధం. భీష్ముడు మహాజ్ఞాని అయినప్పటికి ఆయన బాహ్యజీవితంలో అనేకమందిచేత మాటలు అనిపించుకోవలసి వచ్చింది, భగవంతుడికి వ్యతిరేకంగా యుద్ధం చేయవలసివచ్చింది, అదీ ఆ దేహప్రారబ్ధం. బాహ్యజీవితాన్ని చూసి ఏ మనిషిని కొలువకూడదు అని అరవిందఘోష్‌గారు చెప్పారు. మనిషికి ఉన్న డబ్బును బట్టిగాని, గౌరవాన్ని బట్టిగాని, అధికారాన్ని బట్టిగాని మనిషి యొక్క విలువ కొలువకూడదు. అతని హృదయసంపద ఎటువంటిది, అతనికి దైవీసంపద ఉందా అని లోపల మనిషి యొక్క హృదయంలోనికి చూసి, అతని అంతస్థుని చూడాలికాని బాహ్యజీవితాన్నిబట్టి చూడకూడదు. ఒకమాట మాట్లాడేటప్పుడుగాని, ఒకపని చేసేటప్పుడుగాని ఆ మనిషి యొక్క హృదయం

ఎలా ఉంది, అతను ఏమైనా ఇతరుల క్షేమం కోరుతున్నాడా అని లోపలజీవితాన్ని చూసి ఆ వ్యక్తి యొక్క విలువ కట్టాలి గాని బాహ్యఆడంబరాలను చూడకూడదు. భీష్ముడు భక్తి గురించి, నీతిశాస్త్రం గురించి, జ్ఞానం గురించి చెప్పాడు. అందరూ తరించటానికి విష్ణు సహస్ర నామాలు చెప్పాడు. డబ్బుకి, జ్ఞానానికి ఒకతేడా ఉంది. డబ్బు ఇతరులకు పంచిపెట్టేకొలది తరుగుతుంది. జ్ఞానం అలాకాదు ఇతరులకు ఇచ్చేకొలది పెరుగుతుంది, ప్రేమకూడా ఇచ్చేకొలది పెరుగుతుంది. నేను మీ అందరిని హృదయపూర్వకంగా ప్రేమిస్తూ ఉంటే నా హృదయంలో ఉన్న ప్రేమ తరగదు, అది పెరుగుతుంది. జ్ఞానం, ప్రేమ తరిగే వస్తువులు కాదు. ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి ఒక మనిషికి మంచిగుణాలు ఉండవచ్చు అంత మాత్రంచేత వాడు పవిత్రుడు కాదు, గుణవంతుడు మాత్రమే. నూటికి నూరుపాళ్ళు ఎవడి హృదయంలో అయితే స్వార్థం లేదో వాడు ఒక్కడు మాత్రమే పవిత్రుడు. లాల్‌బహదూర్ శాస్త్రిగారు పవిత్రుడు. నాలుగు మంచిగుణాలు ఉన్నంతమాత్రంచేత వాడు పవిత్రుడు కాదు. కొంతమంది బాహ్యంగా చూస్తే చాలా మర్యాదస్థులుగా ఉంటారు లోపలమటుకు నూటికి నూరుపాళ్ళు స్వార్థంగా ఉంటారు. వారు పవిత్రులు కాదు. బాహ్యంగా బాగానే ఉన్నా లోపల శుభ్రంగా కుళ్ళిపోయి ఉంటారు. మీరు సబ్జక్టును బాగా అర్థం చేసుకొని, జాగ్రత్తగా ఫాలో అవుతూ ఉంటే అలా కూర్చొన్నవారు కూర్చున్నట్లుగానే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, దానికి బుద్ధిసూక్ష్మత అవసరం.

భీష్ముడు, రామకృష్ణుడు, వసిష్ఠుడు, రమణమహర్షి వంటి మహాత్ముల ద్వారా ఆత్మశక్తి, ఆత్మజ్ఞానం బాగా వ్యక్తమయ్యింది కాబట్టి ఇవాళ మనం వారిని గౌరవిస్తున్నాము. ఎన్ని మంచిగుణాలు ఉన్నా స్వార్థపరుడిలో నుండి భగవంతుడి తాలుక శక్తి వ్యక్తంకాదు. నాలో ఏదైతే ఉందో మీలో కూడా అదే ఉంది, మీలో లేనిది నాలో ఏమీలేదు అని భగవాన్ అంటూ ఉండేవారు. ఆయనలో ఏదైతే ఉందో మనలో కూడా అదే ఉన్నమాట నిజం కాని మనలో ఉన్నది మనకు తెలియటం లేదు, అందుచేత ఇతరులకు వ్యక్తం కావటం లేదు. ఆయనలో ఉన్నది ఆయనకు తెలుస్తోంది, ఆ ఉపాధి ద్వారా ఆయన హృదయంలో ఉన్న జ్ఞానం వ్యక్తమవుతోంది. స్థూలబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం, యోగాభ్యాసాలు అవసరమే, సూక్ష్మబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం అక్కరలేదు, వాడికి ఒక వాక్యం చెపితే, దానిని మననం చేసి అందుకోవలసింది అందుకొంటాడు అన్నారు భగవాన్. నేను ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీ లేదు అని చెప్పారు. ఆ వాక్యం చదివేసి పుస్తకం పడేస్తాము అలాకాదు ఆ వాక్యం దేవుడై ఉన్నది. ఆ వాక్యం ఒక మహాత్ముడి హృదయంలో నుండి వచ్చింది. అందులో ఏదో ఉంటుంది అని దానిని పరిశీలన చేయటం మానివేసి పూరికే చదివి పడేస్తాము ఎందుకంటే ఆ వాక్యం మీద మనకు గౌరవం లేదు, దాని తూకం, విలువ మనకు తెలియటం లేదు వెయ్యి రూపాయల

కాగితం చంటిపిల్లవాడికి ఇస్తాము అనుకోండి, అలా చూస్తాడు, ఇలా చూస్తాడు, తరువాత చింపి అవతల పరేస్తాడు ఎందుచేత దాని విలువ వాడికి తెలియదు, మన పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆ వాక్యం విలువ మనకు తెలియక ఏదో చదివి పడేస్తాము. మనకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే, అనుభవంలోనికి వస్తూ ఉంటే మనం బాగుపడటానికి ఒక వాక్యం చాలు, ఒక మాట చాలు. మనకు యోగ్యత ఉంటే ఒక చూపుచాలు, ఒక టచ్ చాలు మనం బాగుపడటానికి. ఏదో కాశీ వెళుతున్నాము, అరుణాచలం వెళుతున్నాము, యాత్రికంగా ఇవి అన్నీ చేస్తున్నాము, ఈ బొమ్మలను గుడుల చుట్టూ, గోపురాల చుట్టూ తిప్పతున్నాము కాని మనం సత్యాన్వేషకులము కాదు. మనలో సత్యవస్తువు ఉంది, దాని గురించి మనం తెలుసుకోవాలి అని మన సాధనను దాని మీద గురిపెట్టటంలేదు. అది తప్ప బాహ్యంగా ఏది సాధించినా అదంతా స్వప్నంతో సమానము అనే బుద్ధి మనకు రావటంలేదు.

ఏ జీవుడు స్వతంత్రుడు కాదు, ఈ జీవకోటి అంతా బొమ్మలు మాత్రమే. సృష్టి అంతా ఈశ్వరసంకల్పముతో నడుస్తోంది అని చెపుతున్నారు. ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? వాడి ఎడ్రసు ఏమిటి అంటే ఆయన నీ హృదయంలోనే ఉన్నాడు. నేను జీవకోటి అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆయన మెయిన్ ఎడ్రస్ అదే. అయితే మనం హృదయంలోనికి తొంగి చూసుకోవటంలేదు, లోపల ఏమి జరుగుతోందో అసలు వాచింగ్ లేదు. మనస్సు ఎప్పడూ ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చేస్తోంది, దానికి లోచూపు లేదు. మనకు ఎంతసేపు బాహ్యజీవితం గొడవలేకాని తపస్సు లేదు, మనకు అంతర్దృష్టిలేదు. మనం నేను, నేను అంటాము, ఆ నేను నిజం కాదు, అది ఒక తలంపు. అందరి హృదయాలలో నేను ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు కదా ఆ నేను సత్యమైనది. దానికి దేహంతో గాని, మనస్సుతోటిగాని, లోకంతోగాని, బాహ్యవిషయాలతోగాని దానికి సంబంధం లేదు. నువ్వు అసత్యముతో తాదాత్మ్యం పొందుతున్నంతకాలము సత్యమైన నేను గురించి నీకు తెలియదు, నువ్వు ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. నేను అక్కడ అది సాధించాను, ఇక్కడ ఇది సాధించాను అని నువ్వు అనుకొంటున్నావు. అలా అనుకోమని భగవంతుడు చెప్పలేదు, నీ బుద్ధి మంచిది కాక అలా ఏడుస్తున్నావు, నీ రాంగ్‌తింకింగ్ వలన, నీ రాంగ్‌బిహేవియర్ వలన ఇలా అనుకొంటున్నావు అంతేగాని అలా అనుకోమని దేవుడు చెప్పలేదు. నువ్వు అనుకొనే గొడవలకు, నీ ఊహలకు, నీకు వచ్చే తలంపులకు, చావు పుట్టుకలకు, నువ్వు అనుభవించే సుఖదుఃఖాలకు లోపలఉన్న సత్యానికి ఇసుమంతయు సంబంధం లేదు. నీ పిచ్చిని బట్టి నువ్వు అలా అనుకొంటున్నావు. నేను ఉంటే అంతా ఉంది అది లేకపోతే ఏమీ లేదు. ఈ నేను ఆ వాక్యాన్ని ధ్యానం చెయ్యాలి. దేవుడు వేరు, ఆయన చెప్పినమాట వేరు కాదు, అందులో ఆయన

హృదయం ఉంటుంది, ఆయన అనుగ్రహం ఉంటుంది. ఎప్పుడైతే ఆ మాటను మీరు ధ్యానం చేస్తున్నారో, ఏ హృదయంలో ఉండి భగవంతుడు ఆమాటను చెప్పాడో అక్కడకు మీ మనస్సు నెమ్మదిగా జారుకుంటుంది, అది ధ్యానం యొక్క ఫలం. మనస్సు నిలబడటానికి మీరు బొమ్మలను ధ్యానం చెయ్యవచ్చు. కాని ఈ వాక్యాన్ని మీరు ధ్యానం చేయటం వలన అది మీ మనస్సుకు తూకాన్ని పెంచి, దానిని లోపలకు తీసుకొని పోతుంది.

హృదయంలో ఉన్న సత్యంలో ఇష్టంలేదు, అయిష్టం లేదు. దేహముతో తాదాత్మ్యం పొందే నేనులో నుండి ఇష్టం వస్తోంది, అయిష్టం వస్తోంది. నేను గొప్ప గొప్ప పూజలు, జపాలు చేసి గొప్పలోకాలకు వెళ్ళిపోతాను అని చెప్పేదీ ఈ దొంగనేనే, ఇతరులచేత గౌరవాలు పొందాలి అనుకొనేది ఈ దొంగనేనే. అదృష్టంతోటి, దురదృష్టంతోటి తాదాత్మ్యం పొందేది నేనే. నువ్వు ఏదైతే కాదో దానితో తాదాత్మ్యం పొందుతూ నేను పుడుతున్నాను, నేను చనిపోతున్నాను, నేను గొప్పవాడిని, నేను దురదృష్టవంతుడిని అని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ ఉంటుంది. ఈ దొంగనేను ఉన్నంతకాలం నీకు పుణ్యాలు, పాపాలు, స్వర్గాలు, నరకాలు, స్నేహాలు, విరోధాలు, సుఖాలు, దుఃఖాలు ఇవన్నీ తప్పవు. దానిని మనం విడిచిపెట్టలేకపోతున్నాము. ఈ దేహగతమైన నేనును ఎందుకు విడిచిపెట్టలేకపోతున్నాము అంటే అదే మనం అనుకొంటున్నాము, ఇలా కొన్ని వేల జన్మలనుండి అలవాటు అయిపోయింది, అందుచేత దానిని డౌట్ చేయలేక పోతున్నాము. ఎవరు ఎంత చెప్పినా అది బయటకు పోవటం లేదు, దాని నుండి విడుదల పొందటానికి మనం ప్రయత్నం చేయలేకపోతున్నాము. మాయ అంత బలీయంగా ఉంది. ఒకోసారి మనం చాలా జాగ్రత్తగా మాట్లాడాలి అనుకొన్నా పొరపాటు మాటలు వచ్చేస్తాయి. స్వామీ వివేకానంద ఎప్పడైనా పొరపాటుగా మాట్లాడితే ఆయనకు ఇంటికి వెళ్ళాక పొరపాటు గురించి తెలిసేది. ఎవరి గురించి అయితే పొరపాటుగా మాట్లాడాడో ఆయన ఇంటికి వెళ్ళి క్షమించమని చెప్పివచ్చేవారు. అది పెద్దవారి లక్షణం. వివేకానంద అంతటివాడు పొరపాటు మాట్లాడాడు అంటే మాయ ఎంత బలీయంగా ఉందో చూడండి. మనకు పాండిత్యం ఉన్నా, తెలివితేటలు ఉన్నా మాయ బలీయంగా పట్టుకొన్నప్పడు మనం హృదయం యొక్క లోతులలోనికి చేరుకోలేము. అక్కడికి చేరటానికి మనకు తూకం సరిపోదు మాయ ఆడించేస్తూ ఉంటుంది. మాయ దారిఇస్తేగాని మనం అక్కడకు వెళ్ళలేము.

ఈలోకం వేరు, దేవుడు వేరు అని మనం అనుకొంటున్నాము. ఎక్కడికక్కడ విడదీసేస్తున్నారు. దేవుడిని పూజగదికి పరిమితం చేస్తున్నారు, బయట ఎలా ఉన్నా పరవాలేదు అనుకొంటున్నారు. లోకం అంతా బ్రహ్మమయం. మీకు కనిపించేది బ్రహ్మం, కనబడనిదంతా బ్రహ్మమే. మీకు బ్రహ్మానుభవం కావాలంటే ఒక ఉదాహరణ చెప్పాడు. బ్రహ్మంకు భిన్నంగా మీరు

ఏది చూడకుండా ఉంటే బ్రహ్మంలో ఐక్యమయ్యే శక్తి పరమేశ్వరుడు మీకు ప్రసాదిస్తాడు. నువ్వు యజ్ఞం చేస్తున్నావు అనుకో అక్కడ అగ్ని ఉంటుంది, అందులో నెయ్యి హోమం చేస్తారు, అగ్ని బ్రహ్మం, నెయ్యి బ్రహ్మం, నెయ్యి వేసే గరిటె బ్రహ్మం, చేసేవాడు బ్రహ్మం, ఎవరిని ఉద్దేశించి చేస్తున్నావో వాడు బ్రహ్మం అనుకొంటూ అంతా బ్రహ్మభావనతో చేస్తే, నువ్వు బ్రహ్మంకు వేరుగా ఏదీ చూడకుండా ఉండగలిగితే నీకు తెలియకుండా నువ్వు బ్రహ్మంలో ఐక్యమవుతావు అని గీతలో చెప్పాడు. అక్కడిదాక ఎందుకు మీకు నేను ఒక అరటిపండు ఇచ్చాను అనుకోండి. నేను ఎల్లయ్యకు ఇచ్చాను అనుకొంటాను. ఆ ఎల్లయ్య బ్రహ్మం అని తెలియటంలేదు. మీకు అరటిపండు ఎలా వచ్చింది, అది మీ సొంతమా, కాదు అది భగవంతుడే ఇచ్చాడు. ఇక్కడ ఇచ్చినవాడు బ్రహ్మం, పుచ్చుకొన్నవాడు బ్రహ్మం, ఇచ్చే అరటిపండు బ్రహ్మం, ఇవ్వటం బ్రహ్మం. ఇంక నువ్వు ఎక్కడ ఉన్నావు? నేను లేను అనే బుద్ధి నువ్వు ప్రాక్టీసు చేస్తే నువ్వు బ్రహ్మంలో ఐక్యమవుతావు. కొంతమంది ఎవరికైనా ఒక అరటిపండు ఇచ్చిన వందపండ్లు ఇచ్చిన గర్వం పెంచుకుంటారు, దానికి కారణం వేరుబుద్ధి. దీనివలన బాహ్యంగా కొంతపుణ్యం రావచ్చుకాని లోపల కుళ్ళిపోతావు. లోకంలో నీవు ఏ పని చేసినా అంతా బ్రహ్మంగానే చూస్తూ పనిచేస్తూ ఉంటే బ్రహ్మంలో ఐక్యమవుతావు. నువ్వు బ్రహ్మంకు భిన్నంగా ఉన్నంతకాలం నీ మీద మాయ బలీయంగా పనిచేస్తుంది. నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు. ఆయన ఎంత జ్ఞానవంతుడో, ఎంత ప్రేమవంతుడో, ఎంత సర్వజ్ఞుడో అని దేవుని యొక్క ఔన్నత్యాన్ని నువ్వు లోపల అహంకారం పెట్టుకొని ఇతరులకు వ్యక్తం చేయాలన్నా అది ఎలా సాధ్యమవుతుంది? సాధ్యం కాదు.

నిద్రలో తెలివితక్కువవాడు, తెలివైనవాడు సమానమే. ధనవంతుడూ, పేదవాడు సమానమే. అధికారం ఉన్నవాడు, అధికారం లేనివాడు సమానమే, నిద్రలో అందరూ సమానమే. అప్పుడు మీ తెలివితేటలు ఎక్కడికి వెళ్ళిపోతున్నాయి. లోపల మీ హృదయంలో దేవుడు వాటిని జాగ్రత్త పెట్టి ఉంచుతున్నాడు. మెలుకువరాగానే నేను అనే తలంపు శిరస్సు లోనికి వచ్చి విజృంభిస్తుంది. నిద్రలో భగవంతుడు అన్నీ జాగ్రత్తపెట్టి ఉంచి నేను అనే తలంపు శిరస్సులోనికి వచ్చి విజృంభించాక ఆ మిధ్యానేనుకు ఆయన జాగ్రత్తపెట్టి ఉంచిన నీ తెలివితేటలు, నీపాపం, నీపుణ్యం అంతా పట్టుకొనిపో అని ఇచ్చేస్తాడు. జాగ్రదవస్థలో వీడు ఆ మూటను వేసుకొని బజారులో తిరుగుతూ ఉంటాడు. జరిగే సంఘటన ఇది. బ్రహ్మకర్మ సమాధి అంటే నీవు చేసే ప్రతీ పనిలోనూ కూడా బ్రహ్మమునే చూడు. అప్పుడు ఏదైతే నేనుగా నీకు వ్యక్తమవుతోందో అది అణిగిపోతుంది, బ్రహ్మమే నీకు తానుగా వ్యక్తమవుతుంది, అది నీ కడసారి జన్మ. అది అపూర్వమైన సాధనా భాగం. గీతలో 4వ అధ్యాయంలో 24వ శ్లోకం మీరు బాగా మననం చేసుకోండి. మీకు ఎంతో బ్రహ్మభావన కలుగుతుంది. మనకు

పూజగదిలో మాత్రమే దేవుడు, బయటకు వచ్చినప్పుడు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తున్నాము. అలాకాదు నీవు చేసే కర్మలన్నింటిలోను కూడా బ్రహ్మమును చూస్తూ పనిచేస్తూ ఉంటే నీకు బ్రహ్మకర్మసమాధి కలుగుతుంది. కర్మ చేస్తున్నప్పుడు కూడా నువ్వు సమాధిస్థితిలోనే ఉంటావు. కృష్ణుడు యుద్ధం చేసినప్పుడు కూడా సమాధిస్థితిలోనే ఉండే వాడు, అది సహజసమాధి. చెఱుకుగెడలో రసం తీసేసిన తరువాత పిప్పి ఎటువంటిదో నీకు ఆనందానుభవం కలిగాక లోకం గొడవలు కూడా అటువంటివే. నేను ఏదో మూర్తిని ధ్యానం చేసుకొంటున్నాను, యిది నాకు ఏమైనా ఉపయోగపడుతుందా అని భగవాన్‌ను అడిగితే తప్పకుండా ఉపయోగపడుతుంది, ఉపాసన వలన మనస్సుకు ఏకాగ్రత కలుగుతుంది. ఏదైనా నామాన్ని తీసుకొని జపిస్తూ ఉన్నా నీ మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. నువ్వు చేస్తున్నజపం భగవంతుడి సన్నిధానంలోనికి తీసుకొనివెళుతుంది. నువ్వు ఏ దేవుడి నామం అయితే చేస్తున్నావో ఆయన మీద నీకు గౌరవం ఉండాలి, నూటికి నూరుపాళ్ళు విశ్వాసం ఉండాలి, అప్పుడు ఆ జపఫలితం నీకు వస్తుంది. జపఫలితం వలన మీకు అమృతానుభవం కలుగుతుంది.

శవం కాలేటప్పుడు అది సరిగా కాలటంకోసం కర్రపెట్టి పొడుస్తారు. శవంతోపాటు చివరకు ఈ పొడిచే కర్ర కూడా కాలిపోతుంది. అలాగే నేను అనే తలంపును నువ్వు విచారణ చేస్తూ ఉంటే అది మిగతా తలంపులన్నింటిని పోగొట్టి చివరకు ఈ నేను అనే తలంపు కూడా పోతుంది అప్పుడు నువ్వు మిగులుతావు అన్నారు భగవాన్. మాయ ఎటువంటిది అంటే ఈ గొడవ వదిలించుకొన్నాము అంటే అది రూపం మార్చి ఇంకో గొడవ రూపంలో వచ్చి దూరుతుంది. అంటే ఒక గోతిలో నుండి లెగిసి ఇంకో గోతిలో పడతాము. ఈ మాయను ఎవరు జయించగలరు. ఎవడైతే నా దయకు పాత్రుడయ్యాడో వాడు మాత్రమే ఈ మాయలో నుండి బయటకు రాగలడుగాని ఇతరులకు సాధ్యం కాదు. మాయ ఇట్టిది అని చెప్పటానికి వీలు లేదు. అది వేషాలు మారుస్తుంది, రూపాలు మారుస్తుంది. అది మాయకాదు అని నీకు అనిపిస్తుంది, వచ్చి నిన్ను పతనం చేస్తుంది. కొంతమంది ప్రతీవిషయానికి విసుగుదలగా ఉంటారు. అది రజోగుణలక్షణం. సత్వగుణం లేకుండా ఎవరికీ తూకం పెరగదు. సాత్వికులు ధన్యులు, వారు లోకమును స్వతంత్రించుకొందురు, వారినే జ్ఞానం వరిస్తుంది. ఎవరు ఏ మార్గంలో సాధన చేసినప్పటికి నేను అనే తలంపు నుండి బయటకు రాకుండా ఎవడూ తరించలేడు. ప్రాణాయామం వలన మనస్సు అణుగుతుంది, జపం వలన మనస్సు అణుగుతుంది. అది సూక్ష్మరూపంలో ఉన్నా మరల మిమ్మల్ని బంధించవచ్చు. చెట్టు ఆకులు లేకుండా ఎండిపోయినట్లు మీకు కనిపించవచ్చు, మరల రెండు వర్షాలు కురిస్తే చిగురించి మరల వృక్షమవుతుంది. అలాగే ఏదైతే నీలో

నేనుగా వ్యక్తమవుతుందో ఆ నేను అనే తలంపు వేరుతో సహా నశించేవరకు నేను తరించాను అని చెప్పటానికి వీలులేదు. ఎక్కడైతే నేను అనే తలంపు అల్పమాత్రంగాను, స్వల్పమాత్రంగాను లేదో అక్కడే భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు. అప్పటివరకు నీవు సంసార చక్రంలో ఉండి తీరవలసిందే.

నువ్వు కర్మలో కూడా బ్రహ్మంను చూడకపోతే నీకు తెలియకుండా దేహగతమైన నేనును ముస్తాబు చేసుకొంటూ ఉంటావు, అది నీకు తెలియకుండా జరిగిపోతూ ఉంటుంది. ప్రతీ మనిషికి దేహగతమైననేనును డెకరేట్ చేసుకోవటానికే జీవితం అంతా సరిపోతుంది. సాధన చేస్తున్నాను అని నీవు అనుకొంటున్నావు గాని సాధన పేరుమీద నేను అనే తలంపును డెకరేట్ చేసుకొంటున్నావు. ఈ లోపుగా మరణం వస్తుంది వల్లకాటిలోకి పోతావు. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే మీకు ఆనందం కలిగింది అనుకోండి. నిమిత్తమాత్రంగా వచ్చేగౌరవాలుగాని, ఆనందాలుకాని ఇవి అన్నీ భవిష్యత్‌లో దుఃఖం తీసుకొనివచ్చి తీరుతాయి. ద్వితీయం వలన వచ్చే ఆనందం అది ఒంటరిగా రాదు, దుఃఖం అనే ముళ్ళకిరీటాన్ని పెట్టుకొని వస్తుంది, అది మీకు కనబడదు. మీకు సబ్జక్టు ఉన్నది ఉన్నట్లుగా పూర్తిగా అర్థమవుతూ ఉంటే మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోవును. భగవాన్ ఒక రహస్యం చెప్పారు. అందరి హృదయాలలో ఉన్నాను, అంతటా వ్యాపించి ఉన్నాను అని పరమేశ్వరుడు చెప్పాడుకదా. ఆ ఒక్కడినే నువ్వు నానాత్వంగా, అనేకత్వంగా చూస్తున్నావు. అలా చూడకుండా ఆ ఒక్కడినే చూస్తూ ఉండు, నీ మనస్సుకు అలా ట్రైనింగ్ ఇయ్యి. సాధనల పేరుమీద దుమ్ము చేసేసుకొంటావు ఏమిటి? ఎన్నాళ్ళు ఈ దొమ్మరవిద్యలు వేసుకొని తిరుగుతావు. పూర్వం మాతాతగారి టైములో సిమ్మెంట్‌రోడ్లు లేవు, తారురోడ్లు లేవు, అన్నీ మట్టిరోడ్లే, ఇప్పుడు కూడా మట్టిరోడ్లుమీద తిరుగుతాను అంటే దానికి అర్థం ఏమిటి? లేటెస్ట్ టెక్నిక్స్ అర్థం చేసుకోండి. మీరు ఏమి చేస్తున్నారు అంటే దేహాన్ని చూస్తున్నారు లేకపోతే మనస్సును చూస్తున్నారు. దేహాన్ని చూస్తే రంగు కనబడుతుంది, మనస్సు వంక చూస్తే గుణాలు కనబడతాయి. దేహం నశిస్తే రంగులేదు, మనస్సు నశిస్తే గుణం లేదు. ఈ రెండూ అబద్ధమే, ఈ రెండూ మాయే. మీరు ఇదంతా వదిలేసి లోపలఉన్న వస్తువును ఒక్కదానినే చూడటం నేర్చుకోండి. మీకు వికారాలు రావు. ఉన్నవస్తువును ఒక్క దానినే అలా చూస్తూ ఉంటే జపం లేకుండా, ధ్యానం లేకుండా, తపస్సు లేకుండా వీటితో పని లేకుండానే మనస్సు దానంతట అది నశిస్తుంది. మీరు రవ్వంతైనా చేసి చూడండి.

వారు బాగున్నారు, వీరు బాగోలేదు, వారి గుణాలు మంచివి, వీరి గుణాలు మంచివి కావు. ఇటువంటి గొడవలు ఎందుకు? ఇలా నువ్వు ఏదైతే కాదో వాటి వంక ఎన్ని సంవత్సరాలు

చూసినా ప్రయోజనం లేదు. నువ్వు ఏదైతే అవునో దానిని చూడటం నేర్చుకో అప్పుడు నీ మనస్సు పడిపోతుంది. ఈ శరీరం నేను, మనస్సును నేను, పుణ్యం నేను, పాపం నేను ఇలా నువ్వు కానిదానిని నువ్వు అనుకోవచ్చు. నువ్వు కానిదానిని నువ్వు అనుకొన్నా నువ్వు కానిది నువ్వు ఎలాగ అవుతావు. నీ హృదయంలో ఒక నిజం ఉంది, దానిని నీవు తెలుసుకోవాలి. నీ హృదయంలో ఉన్న నిజం తెలియకుండా నీకు స్వేచ్ఛ లేదు, స్వాతంత్ర్యం లేదు, అజ్ఞానంలోనుండి బయటకు రాలేవు. వేదంలో ఏమని చెప్పారు అంటే నీ హృదయంలో ఒక నేను ఉంది, అదే నీవు అన్న సంగతి నీకు తెలిసేవరకు జీవుడు బ్రహ్మంలో ఐక్యంకాడు. నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు అనుకో. కాని నువ్వు ఏది అనుకొన్నా నువ్వు అదే అయి ఉన్నావు. నేను ఉన్నాను. నేను ఉండటమే కాదు ఆ నేను నేనై ఉన్నాను. ఆ ఎక్స్‌ప్రెషన్ చూడండి. ఒకవేళ నేను ఉండవచ్చు దానికీ మనకీ సంబంధం లేదేమో అని మనం అనుకొంటామేమోనని ఎంత క్లారిటీగా చెపుతున్నారో చూడండి. ఇంత వివరంగా చెపుతూ ఉంటే గ్రహించేబుద్ధిలేకపోతే వారు ఏమి చేయగలరు. గుర్రాన్ని నీటి దగ్గరకు తీసుకొనివెళ్ళి తాగమంటాము, అది తాగకపోతే మనం ఏమి చేయగలము. కొంతమందిని మనం సుఖపెడదామన్నా వారి బుద్ధి సరిగా లేకపోతే వారు సుఖపడరు, వారి బుద్ధి వారిని సుఖపడనివ్వదు.

పరుషవాక్యాలు లేకుండా ఎవరైతే మాట్లాడుతున్నారో వారికి వాక్కుతపస్సు ఉన్నట్లు. కొంతమంది పరుషవాక్యాలు మాట్లాడతారు. పవిత్రుడైన లక్ష్మణుడిని సీతమ్మ అనరాని మాటలు అంది, ఆ మాటలకు చివరికి రావణాసురుడు తీసుకొనిపోయాడు. నోటినుండి వచ్చే పరుష వాక్యాలు అవి ఎవరైతే అన్నారో వారి పీక పట్టుకొంటాయి, అందరికీ మంచికలగాలి, అందరికీ సుఖం కలగాలి, అందరూ శాంతిగా ఉండాలి అని హృదయపూర్వకంగా నిండుమనస్సుతో ప్రార్థిస్తూ ఉంటే అది మానసికతపస్సు. భగవంతుడు ఏపని అయితే చేయవద్దని చెప్పాడో శరీరంతో ఆపని చేయకుండా ఉండగలిగితే అది శారీరకతపస్సు. వాక్కుతపస్సు, శారీరకతపస్సు, మానసికతపస్సు లేకుండా లోపలఉన్న జీవుడు పవిత్రుడు కాడు. పవిత్రుడు కానివాడికి, శ్రద్ధలేనివాడికి, జిజ్ఞాసలేనివాడికి జ్ఞానం గురించి చెప్పినా అది పందుల ముందు రత్నాలు పోసినట్లుగా ఉంటుంది అని బైబిలులో చెప్పాడు. ఆ పంది రత్నాలను ముట్టుకోకుండా ఆ రత్నాల ప్రక్కనుండి వెళ్ళిపోయినా పరవాలేదు కాని ఆ రత్నాలను కాళ్ళతోటి భూమిలోకి తొక్కేసి పోతుంది అన్నాడు. భగవాన్ చెప్పింది ఇంకొకసారి చెపుతున్నాను. మీరు నానాత్వాన్ని చూడటం మానేయండి, అనేకత్వాన్ని చూడటం మానేయండి. జపంతోటి, ధ్యానంతోటి సంబంధం లేకుండా మీ మనస్సు కాలి బూడిద అయిపోతుంది. ఇది ఒక్కపైసా ఖర్చులేనిపని. ఎప్పుడైతే అనేకత్వాన్ని నువ్వు మనస్సుతో చూడటం మానేసావో నీకు ఉన్నవస్తువు ఉన్నట్లుగా

వ్యక్తమవుతుంది. ఒకవేళ మీరు బాహ్యంగా ఏదైనా మాటలు చెప్పినా, మీ మనస్సును ఈశ్వరుడికి ఇవ్వరు అనుకోండి, ఈశ్వరుడు తన స్వరూపం మీకు ఇవ్వడు. మనలో అంతర్యామిగా ఉన్నాడు కాబట్టి మన మనస్సులో ఏముందో ఆయనకు తెలుసు అందుచేత మన మాటలకు ఆయన మోసపోడు. మనం ఒక రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందుతున్నాము కాని దేవుడికి రూపం లేదు, నామం లేదు. అన్ని రూపాలు ఆయనవే, అన్ని నామాలు ఆయనవే. అది తెలియకపోవటం వలన నానాత్వం చూస్తున్నాము. నానాత్వం చూసేకొలది మనస్సు పెరిగిపోతుంది, అన్నింటిలోను ఏకత్వాన్ని చూస్తే మనస్సు దానంతట అదే అణిగిపోతుంది. కడుపులో లేనిది కౌగిలించుకొంటే వస్తుందా అని ఒక సామెత ఉంది. నీకు ప్రేమంటే ఎలా ఉంటుందో, భక్తి అంటే ఎలా ఉంటుందో, ఆప్యాయత అంటే ఎలా ఉంటుందో తెలియదు, బయట ఏదో కౌగిలించుకొంటే అది వస్తుందా? మనం అంతా యాంత్రిక జీవితాలకు అలవాటు పడ్డామని అంతర్యామికి తెలుసు.

ఒకడు భగవాన్ దగ్గరకు వస్తూ టౌనులో ఒక అరటిగెల కొనుక్కొన్నాడు. వాడికి దారిలో వినాయకుడి గుడి కనిపించింది. వాడు ఏమనుకొన్నాడు అంటే గెల అంతా భగవాన్‌కు ఇచ్చే బదులు అందులో ఒక అత్తం తీసి తిరిగి వచ్చేటప్పడు గణపతికి ఇద్దాము అనుకొన్నాడు. అలా అనుకోవటంలో పొరపాటులేదు. ఆయనవచ్చి ఆశ్రమంలో గెల ఇచ్చాడు, పది నిమిషాలు కూర్చొని వెళ్ళిపోతూ ఉంటే భగవాన్ పిలిచి గణపతి వాటాకూడా నాకు ఇచ్చావేమిటి? గణపతి వాటా గణపతికి ఇచ్చేయి, ఆ గెలలో ఒక అత్తం పట్టుకొనిపో అన్నారు. ఇక్కడ ఒకటి మీరు గుర్తు పెట్టుకోండి. నేను చెప్పిన ప్రతీమాట ఇక్కడ ఎలా రికార్డు అవుతోందో అలాగ మనకు వచ్చే ప్రతీ తలంపు కూడా రికార్డు అయిపోతూ ఉంటుంది, భగవంతుడు సర్వసాక్షి. భగవంతుడు అన్నింటిని జాగ్రత్త పెట్టి ఉంచుతాడు, వాటికి మనం సమాధానం చెప్పాలి, భగవాన్ ఒక మంత్రం చెప్పారు. ఎవ్విరితింగ్ విల్ పాస్ ఎవే. మీకు ఏదైనా మంచి సంఘటన జరిగినా, చెడు సంఘటన జరిగినా ఏదీ నిలబడదు, అన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. మంచీ నిలబడదు, చెడూ నిలబడదు, ఎందుచేతనంటే అది నిజం కాదు. నువ్వు ఏదో చేస్తే అది వచ్చింది, అనుభవిస్తే పోతూ ఉంటుంది. దీనికి ఆచార్యులవారు ఏమన్నారంటే ఒకవేళ మీకు నిజంగా దురదృష్టం వచ్చింది అనుకోండి పాయసం నోటిలో పోసుకొన్నప్పడు ఎలా ఎంజాయ్ చేస్తారో, చెడుప్రారబ్ధాన్ని కూడా అలా ఎంజాయ్ చెయ్యండి, భవిష్యత్‌జన్మలలో మరల ఆ ప్రారబ్ధం నిన్ను ముట్టుకోదు అని చెప్పారు. అక్కడ కూడా నానాత్వాన్ని చూడవద్దు, అందులో కూడా బ్రహ్మంనే చూడు, అప్పడు నీ మనస్సుకు వికారాలు రావు. సృష్టిలో ఏ సంఘటన జరిగినా అది బ్రహ్మంకు తెలియకుండా జరగటానికి వీలులేదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఏప్రియల్ | 6 | ఖండవల్లి |
| ఏప్రియల్ | 13 | భీమవరం, ఆనంద ఎస్టేటు |
| ఏప్రియల్ | 14 | పాలకోడేరు - శ్రీరామనవమి |
| ఏప్రియల్ | 20 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

**శ్రీ రమణ మహర్షి శిష్యులైన మీరు**

**N** తో ఎత్తుకెదిగినారు కీర్తిలో మీ

**A** నలోని అభిమానమును మేము

**N** టికీ మర్చిపోలేము మా శిశు మందిర్

**N** తో పుణ్యం చేసుకుంది మీ రాకతో.  మీరు మా

**A** డ చూపిన ఆదరణ మీ ఔన్నత్యం ఈ

**G** ల్లాకే తలమానికం.

**A** క్కడ మీ పాదం సోకుతుందో అక్కడ మీరు చెప్పిన

**R** యోక్తి వెదజల్లబడి అందరిలో హైందవ విత్తునాటబడి

**U** గయుగాలా ప్రాకాలని ఆకాంక్షిస్తూ......

Remember **M**

Remember **E**

Don't Remember **"ME"**

అని వేడుకొంటూ

**శ్రీ సరస్వతి శిశు మందిరం**

**లక్కవరం**



విజయవాడ సీతానగరం రామకృష్ణ మిషన్ స్వామీజీతో
సద్గురు శ్రీ నాన్నగారు



విజయవాడ సీతానగరం రామకృష్ణ మిషన్ హైస్కూలులో
ప్రసంగిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు